సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన రాము

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 6 : ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి రాము అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం జీ శ్రీనివాస్‌రావు తన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు దామోదర్‌రావు స్మారకార్థం రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా రాము ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ యాస్మిన్ బీ, ఏసీజీ రవికుమార్, ఉపాధ్యాయులు భూపతి, కరుణ, అనిత, చంద్రశేఖర్‌రావు, రమేశ్, చంద్రకళ, నరేందర్, లక్ష్మి, ఉపేందర్‌రెడ్డి, శేషు కుమార్, రత్నాకర్, విజయ నిర్మల, తహెరా మసూద్ బేగం, లలిత, సత్యా, సతీశ్, సందీప్, రాజేశ్ పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌లో సాంకేతిక సమస్యలు : డీఆర్డీవో

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 6 : సదరం శిబిరానికి హాజరుకావడం కోసం శుక్రవారం మీ సేవ కేంద్రానికి వెళ్లిన దివ్యాంగులకు స్లాట్ బుకింగ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. రాష్ట్ర స్థాయిలో ఈ సమస్య ఉన్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి (డీఆర్డీవో) ఎన్ వసంత తెలిపారు. రెన్యూవల్ అవసరమైన దివ్యాంగులకు స్లాట్ బుకింగ్ కోసం మరో ఆరు రోజుల సమయం పడుతుందని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగులు గమనించాలని సూచించారు.

జాఫర్‌గూడెం ప్రభుత్వ పాఠశాలలో అన్నదానం

రఘునాథపల్లి, సెప్టెంబర్ 6: మండలంలోని జాఫర్‌గూడెం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శాగ కైలాసం పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కైలాసం మాట్లాడుతూ తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఏదైనా సేవా కార్యక్రమం చేపట్టాలనే తలంపుతో ఉన్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ వారి పుట్టిన రోజున ఏదేని సేవా కార్యక్రమం చేపట్టాలని ఆయన సూచించారు.

సిబ్బందితో సొంత పనులు చేయించుకున్న ఎంపీడీవో

ఎంపీడీవో సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 6 : రెండు రోజుల క్రితం కోదాడ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన విజయశ్రీ స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమీపంలో అద్దె ఇల్లు తీసుకున్నారు. కాగా శుక్రవారం తన సామగ్రిని గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో తరలించారని పలువురు ఆరోపించారు. గ్రామాల్లో డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలుతుంటే వారితో పనిచేయించకుండా సొంత పనులకు సిబ్బందిని వినియోగించడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై

రఘునాథపల్లి, సెప్టెంబర్ 6:వినాయక చవితి వేడుకల సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పూజ సామాగ్రి, వస్తువులు కొనుగోలు చేసే సమయంలో దొంగలు మీ పక్కనే మిమ్మలను గమనిస్తూ సెల్‌ఫోన్లు దొంగిలించే అవకాశం ఉందన్నారు, రద్దీ ప్రదేశాల్లో విలువైన వస్తువుల ను జాగ్రతగా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. నేడు, రేపు రెండు రోజులు సెలవులు రావడంతో ప్రజలు స్వగ్రామాలకు వెళ్తారని, విలువైన బంగారు ఆభరణాలను జాగ్రత్త చూసుకుని ఇంటి పక్కనున్న వారికి సమాచారం అందించి వెళ్లాలని ఆయన కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలి

- భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పల్లా

బాలకృష్ణరెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, వంతెనల మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వివిధ ప్రభుత్వశాఖల జిల్లా అధికారులను కోరారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషాను కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, నేషనల్ హైవే ఈఈలు, డీఈలు, ఇతర జిల్లా అధికారులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ కొద్ది రోజులుగా జిల్లాలో కురిసిన అతి భారీ వర్షాలకు నియోజకవర్గంలోని పలుచోట్ల రోడ్లు కొట్టుకుపోయాయన్నారు. భవనాలు, పంచాయతీరాజ్ రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయని వివరించారు. అనేక గ్రామాల్లో నివాస గృహాలు కూలాయని పల్లా తెలిపారు. మరోవైపు వివిధ రకాల పంటలు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి వారికి పరిహారం అందించాలని కోరారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతు పనులకు అవసరమైన అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, నాయకులు శారదస్వామి, రేఖ, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

మలిదశ ఉద్యమకారుడు జిట్టా : పల్లా

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు భువనగిరి ముద్దుబిడ్డ జిట్టా బాలకృష్ణ రెడ్డి అకాల మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ఉద్యమంలో కీలకంగా పనిచేసి బీఆర్ఎస్ యువజన సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలను చైతన్యపరుస్తూ యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. బాలకృష్ణారెడ్డి మరణం తనకు వ్యక్తిగతం తీరని లోటని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ అశ్రునివాళి అర్పించారు.

ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శివాలయంలో పూజలు

దేవరుప్పుల, సెప్టెంబర్ 6: మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు పెద్దాపురం వెంకటేశ్వరశర్మ తెలిపారు. భక్తులు మూడు రోజులుగా అర్చనలు చేస్తూ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అంబటి సోమయ్య, రెడ్డిరాజుల భిక్షపతి, సోమయ్య బృందంతో భజనలు, భక్తి పాటలు కొనసాగించారు. మర్రి శోభ, చల్ల విజయ, కాసారపు పద్మ, ఈదునూరు నిర్మల, నడిదె కల్పన, ప్రణీత, తేజస్విని, రెడ్డి రాజుల హేమ, లావణ్య పాల్గొన్నారు

గణేశ్ మండపాలకు బహుమతులు

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 6 : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జనగామ పట్టణంలో ఏర్పాటు చేసే ఆదర్శ గణేశ్ మండపాలకు ప్రత్యేక బహుమతులు ప్రదానం చేయనున్నట్లు గణపతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ మంచాల రవీందర్ తెలిపారు. శుక్రవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. మండపాలకు పోలీసు, విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి జిల్లా కార్యదర్శి అర్జున్ సింగ్, కార్యదర్శి సతీశ్, బోగ కైలాసం, సత్యం, పవన్ శర్మ పాల్గొన్నారు.

అలరించిన సుద్దాల అశోక్‌తేజ 'కావ్య గానం'

మాట్లాడుతున్న అశోక్‌తేజ

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 6 : ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ రచించి, గానం చేసిన 'శ్రీ శూద్ర గంగావతరణం' కావ్యం సాహితీ ప్రియులను అలరించింది. జిల్లా కేంద్రంలోని కెమిస్ట్ భవన్‌లో శుక్రవారం జనగామ రచయితల సంఘం, పద్మశాలి సంఘం సంయుక్తంగా కావ్య గాన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా అశోక్ తేజ హాజరై 'భూమి అంటే గంగకు భూమంతా ఇష్టం, అడవి అంటే గంగకు అడవంతా ఇష్టం, కొండలంటే, సంద్రమంటే, మనుషులంటే, మానులంటే, ప్రాణకోటి అంటే పంచ ప్రాణమంతా ఇష్టం' అని కావ్య గానం చేశారు. ప్రతి అక్షరాన్ని పదాలతో వల్లె వేస్తూ అర్థవంతంగా వివరిస్తూ సభికులను ఉత్సాహపర్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్, సమన్వయకర్త పొట్టబత్తిని భాస్కర్, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, కవులు, కళాకారులు కృష్ణ, సోమనర్సింహాచారి, సాయి కిరణ్, సదానందం పాల్గొన్నారు.

సాయుధ పోరాటవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

గూడూరులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బచ్చన్నపేట, సెప్టెంబర్ 6: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చుంచు విజయేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పోచన్నపేట, నక్కవానిగూడెం, పడమటి కేశవాపురం, లింగంపల్లి, మన్‌సాన్‌పల్లి, సాల్వాపురం, మల్లు స్వరాజ్యం కాలనీలో అమరవీరుల స్తూపాలను నివాళులర్పించి ఎర్రజెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా విజయేందర్ మాట్లాడుతూ సాయుధ పోరాటానికి సంబంధంలేని బీజేపీ నేతలు సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన కొట్లాటగా వక్రీకరించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. పెత్తందార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు నిర్వహించిన వీరోచిత పోరాటాన్ని ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. నాయకులు రావుల రవీందర్‌రెడ్డి, మహంకాళి జనార్ధన్, ఎడబోయిన రవీందర్‌రెడ్డి, బైరపని బలరాములు, బండకింది బాలనారాయణ, తాడూరి వెంకటమ్మ, కిష్టయ్య, రాములు, బాలరాజు, నరసింహులు, రమేశ్, అశోక్, సంధ్యారాణి పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య కోరారు. శుక్రవారం పాలకుర్తి, గూడూరు, తిరుమలగిరి, దర్ధేపల్లిలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వీరుల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. ఈనెల 10న వీర నారి చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించాలన్నారు. నాయకులు బెల్లి సంపత్, ముస్కు ఇంద్రారెడ్డి, ఫణికిర భాస్కర్, శ్రీను, సోమన్న, సమ్మయ్య, ఎండీ మహబూబ్, అబ్బాస్, రాజు పాల్గొన్నారు.

సింగరాజుపల్లి, చాగల్లు ప్రభుత్వ పాఠశాలల్లో మట్టి విగ్రహాలను చూపుతున్న విద్యార్థులు

మట్టి గణపతులతో పర్యావరణాన్ని పరిరక్షించాలి

దేవరుప్పుల, సెప్టెంబర్ 6 : వినాయకుడి నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రజలు మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని, తద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని విద్యార్థులు అన్నారు. మండలంలోని సింగరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేశారు. హెచ్ఎం అంబటి అంజయ్య మాట్లాడుతూ రసాయనాలతో తయారు చేసిన గణపతి విగ్రహాలతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. గణపతి విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులు అరుణ్,ప్రణవి, అభిషేక్, సాత్విక్, విగ్నేష్, కల్యాణ్, నందినిని అభినందించారు. ఉపాధ్యాయులు మాధవి, నాగమణి వీరిని ప్రోత్సహించారని ఆయన తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : మండలంలోని చాగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి గణపతులను పంపిణీ చేశారు. శుక్రవారం ఎన్‌జీసీ కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 230 మట్టి వినాయకులను తయారు చేయించి పంపిణీ చేయించారు. హెచ్ఎం కే అంజిరెడ్డి మాట్లాడుతూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే రంజిత్ కుమార్, రాజేంద్రప్రసాద్, పరమేశ్వరి, రఘుపతి, కే.ప్రకాశం, శాంతి, లలిత, విజయకుమార్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆర్య వైశ్య సంఘం జిల్లా నాయకుడు రాపాక విజయ్ అన్నారు. మండల కేంద్రంలో సుధా టెక్నో స్కూల్ సౌజన్యంతో శుక్రవారం మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బీజ్జల సోమన్న, మారం శ్రీనివాస్, అల్గాడి వెంకటేశ్, మారం రవికుమార్, రాపాక ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


రామ్మోహన్‌రావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లా, అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 9: డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని బమ్మెర ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ముచ్చింతల రామ్మోహన్‌రావుకు ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం లభించింది. గురువారం జనగామలో నిర్వహించిన సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, మహాత్మాహెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

పోషణమాసోత్సవంలో ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి

బచ్చన్నపేట, కళ్లెం అంగన్‌వాడీ కేంద్రాల్లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

బచ్చన్నపేట సెప్టెంబర్ 6:అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు కొన్నె గ్రామంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్నంతో పాటు ఆకు కూరలు సమానంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తున్న పౌష్టికాహారంను తీసుకోవడం ద్వారా తల్లులు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ఆమె వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్స్ ఉషారాణి, విజయ, పద్మ పాల్గొన్నారు.

లింగాలఘనపురంలో..

లింగాలఘనపురం : ఆకు కూరల్లో పోషక విలువలు ఉంటాయని డీబ్ల్యూవో జయంతి అన్నారు. మండలంలోని కళ్లెంలో ఐసీడీఎస్ అధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. జయంతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందిస్తున్నామన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హంసమ్మ, హెచ్ఎంలు యాదగిరి, చంద్రం అంగన్‌వాడీ టీచర్లు రేణుక, శారద, వసంత, మంజుల, అనిత పాల్గొన్నారు. లింగాలఘనపురంలో జరిగిన సమావేశంలో టీచర్లు సావిత్రి, రాణి, ఇందిర , విజయలక్ష్మి పాల్గొన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల : మండలంలోని పెదమడూరు, కోలుకొండ, సింగరాజుపల్లి, అప్పిరెడ్డిపల్లి, చినమడూరు, దేవరుప్పులలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు శ్రీదేవి, సావిత్రి అతిథులుగా హాజరై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యం విషయంలో పలు సూచనలు చేశారు. ఆర్‌బీఎస్‌కే వైద్యులు రజనీకాంత్ పిల్లల ఆరోగ్యాన్ని పరిశీలించి, ఎత్తు, బరువును కొలిచారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు ప్రబావతి, భారతి, ఇందిర, సుభద్ర, సులోచన, భాగ్యమ్మ, శోభ, అంజమ్మ, ఆశ వర్కర్లు జ్యోతి, పుష్ప, అనిత పాల్గొన్నారు.

దేవరుప్పుల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్య, ఆరోగ్యశాఖ పీహెచ్ ఎన్ రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇప్పగూడెంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్.విజయ, ఉపేంద్ర, మంజుల, రేణుక, పార్వతి, రజిత, ఏఎన్ఎం వనజ, ఆశవర్కర్ రమ పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి : ఆర్డీవో

జనగామ, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : గణపతి నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్నబీ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జనగామ ఆర్డీవో వెంకన్న, ఏసీపీ పార్థసారధి ఉత్సవ కమిటీలకు సూచించారు. శుక్రవారం జనగామలో వివిధ భక్త, భజన మండళ్లు, ఉత్సవ కమిటీలు, వివిధ ముస్లిం, మైనార్టీ మతపెద్దలతో అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి శాంతి సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు కార్యాచరణతో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ మతాల పెద్దలు, సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్ : గణపతి నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శానిటేషన్‌ను ప్రతి రోజూ నిర్వహించాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, ఏసీపీ భీంశర్మ, సీఐ వేణు పాల్గొన్నారు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

బచ్చన్నపేట, సెప్టెంబర్ 6: మండలంలోని పలు గ్రామాల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో మల్లికార్జున్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. కేంద్రాల చుట్టూ పరిస్థితిని వీక్షించి అవసరమైతే మరోచోటుకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రజిత

రఘునాథపల్లి సెప్టెంబరు 6 : రక్తహీనతపై గర్భిణులు, చిన్నారులకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎం రజిత సూచించారు. మండలంలోని కోమల్ల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనతకు లోను కాకుండా గర్భిణిలు, కిశోర బాలికలు పప్పులు, ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తల్లులు, గర్భిణులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎండీ ఫాతిమా బేగం,బొల్లపల్లి ప్రేమలత పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్స్ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 6 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం జిల్లా నూతన కమిటీని శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఐఈవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే జితేందర్‌రెడ్డి, సెక్రెటరీగా జీ మల్లేశ్, వైస్ ప్రెసిడెంట్‌గా చాగంటి శ్రీనివాస్, ఉమెన్ సెక్రెటరీగా సునంద ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర పరిశీలకుడు ధర్మేంద్ర సమక్షంలో జిల్లా కమిటీకి ఎన్నికలు నిర్వహించారు.

తాటికొండలో ఎలుగుబంటి సంచారం

తాటికొండ శివారులో ఎలుగుబంటి

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 6 : మండలంలోని తాటికొండ శివారులో రెండు రోజులుగా ఎలుగుబంటి సంచరిస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖిలాగుట్ట, పెద్దగుట్ట పరిసరాల్లో గురువారం, శుక్రవారం ఎలుగుబంటి కనిపించిందని పలువురు తెలిపారు. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు.

మతవిద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు

రఘునాథపల్లి, సెప్టెంబర్ 6: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు పెట్టినా, ఫార్వర్డ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మెసేజ్‌లు, వీడియోలు పోస్టు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

యువకుడి వద్ద గంజాయి పట్టివేత

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 6 : మండలంలోని పాంనూర్‌కు చెందిన కలకోల రాకేశ్ వద్ద 43 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు చిల్పూరు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం పోలీసులు తనిఖీ చేయగా రాకేశ్ పట్టుబడ్డాడని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ సీఐ జీ వేణు అతడిని విచారించగా నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని మౌలాలి బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి వద్ద రూ.వెయ్యికి నాలుగు ప్యాకెట్లు తీసుకుని విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలి

మాట్లాడుతున్న సీఐ గట్ల మహేందర్‌రెడ్డి

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 6: గ్రామాలు, తండాల్లో ప్రతిష్ఠించే వినాయక విగ్రహాలకు తప్పని సరిగా నిర్వాహకులు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వినాయక మండపాల్లో రాత్రి వేళల్లో నిర్వాహకులు నిద్రించాలన్నారు. ప్రమాదవశాత్తు మండపాల్లో ప్రమాదాలు జరిగితే ఇసుక బస్తాలు లేదా నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మైక్ పర్మిషన్ తీసుకోవాలని, మద్యం సేవించి గణేశ్ నిమజ్జం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మత పరమైనా లేదా రాజకీయ పరమైన పాటలు వేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సైలు ఎం సాయి ప్రసన్నకుమార్, ఎం లింగారెడ్డి ఉన్నారు.

విష జ్వరాలు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలి

హెల్త